# సాక్షి చిత్తూరు

బుధవారం । 5 । మార్చి । 2025






**సారా నిర్మూలనలో భాగస్వామ్యం**

నాటుసారా నిర్మూలనలో ప్రజలు భాగస్వామ్యం కావాలని జిల్లా అసిస్టెంట్ కమిషనర్ తెలిపారు. - 8లో



**మామిడిలో దిగుబడులు సాధించాలి**

మామిడి సాగులో సరైన యాజమాన్య పద్ధతులు పాటించాలని జిల్లా ఉద్యానవన శాఖాధికారి సూచించారు. - 8లో



**ముగిసిన అంతర్జాతీయ సదస్సు**

తిరుపతిలోని జాతీయ సంస్కృత వర్సిటీలో 3 రోజులుగా నిర్వహిస్తున్న అంతర్జాతీయ సదస్సు మంగళవారం ముగిసింది. - 8లో




## న్యూస్‌రీల్

### రెండు బస్సులకు 7 లక్షల జరిమానా

చిత్తూరు రూరల్ (కాణిపాకం): ట్యాక్స్ చెల్లించకుండా తిరుగుతున్న రెండు వాహనాలకు జిల్లా రవాణాశాఖ అధికారులు జరిమానా విధించారు. తమిళనాడులోని చెన్నై నుంచి తిరుపతి మీదుగా వెళుతున్న ఓ బస్సు, కోయంబత్తూరు మీదుగా మరో బస్సును చిత్తూరు నగరంలో సోమవారం రాత్రి పట్టుకున్నారు. విచారిస్తే పన్ను చెల్లించకుండా తిరుగుతున్నట్లు గుర్తించారు. ఒక బస్సుకు రూ. 3 లక్షలు, మరో బస్సుకు రూ. 4 లక్షల జరిమానా విధించినట్లు డీటీసీ నిరంజన్‌రెడ్డి తెలిపారు.

### లైన్‌మెన్‌లు జాగ్రత్తలు పాటించాలి : ఈఈ



మాట్లాడుతున్న ఈఈ మునిచంద్ర

చిత్తూరు కార్పొరేషన్ : విధి నిర్వహణలో ఉద్యోగులు జాగ్రత్తలు పాటించాలని ట్రాన్స్‌కో ఈఈ మునిచంద్ర తెలిపారు. లైన్‌మెన్ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక కొంగారెడ్డిపల్లె ఏఈ కార్యాలయంలో కేక్‌కట్ చేసి మాట్లాడారు. గత సంవత్సరం లైన్‌మెన్ దినోత్సవాన్ని అధికారికంగా గుర్తించారన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా ఉండకుండా భద్రతా ప్రమాణాలు పాటించాలన్నారు. వీలైనంత వరకు అందరూ అప్రమత్తంగా ఉండాలని డీఈ ప్రసాద్ వివరించారు. కార్యక్రమంలో ఏఈ రాము, లైన్‌మెన్లు పాల్గొన్నారు.

### కథల పోటీ ఫలితాలు విడుదల

పలమనేరు : పైనేని మునెమ్మ స్మారక జాతీయ కథల పోటీ ఫలితాలను స్థానిక తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి నిర్వాహకులు తులసీనాథంనాయుడు మంగళవారం విడుదల చేశారు. ఆరు రాష్ట్రాల నుంచి మొత్తం 119 కథలు పోటీకి రాగా ఇందులో మొదటి బహుమతి హైదరాబాదుకు చెందిన రోహిణి వంజారి రాసిన బ్రహ్మమొకటేనా, రెండో బహుమతి వైజాగ్‌కు చెందిన సుగుణరావు రాసిన జనులాపుత్రిని కనుగొని, మూడో బహుమతి తమిళనాడు తిరుత్తణికి చెందిన ఓట్ర ప్రకాష్‌రావు రాసిన మురికి కాలువ కథలు ఎంపిక చేసినట్లు తెలిపారు. దీంతో పాటు పలువురికి ప్రోత్సాహక బహుమతులను అందజేస్తున్నట్లు చెప్పారు. గెలుపొందిన విజేతలకు త్వరలో పురస్కారాలను అందజేయనున్నట్లు ప్రకటనలో పేర్కొన్నారు.

### నాణ్యమైన భోజనం అందించాలి

- రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ్ ప్రతాప్‌రెడ్డి



పూతలపట్టులోని రేషన్ షాపును పరిశీలిస్తున్న చైర్మన్

పూతలపట్టు(కాణిపాకం): ప్రభుత్వ బడికొచ్చే విద్యార్థులకు నాణ్యమైన భోజనం వండి పెట్టాలని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ్ ప్రతాప్‌రెడ్డి ఆదేశించారు. పూతలపట్టు మండలంలో మంగళవారం ఆయన పర్యటించారు. ఎర్ర చెరువు అంగన్‌వాడీ కేంద్రం, రేషన్‌షాపు, మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. అంగన్‌వాడీలో విద్యా బోధన, పౌష్టికాహార పంపిణీపై లోతుగా పరిశీలించారు. రేషన్ షాపులో నిత్యావసర సరుకుల పంపిణీపై కార్డుదారులతో మాట్లాడారు. జెడ్పీ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి పిల్లలతో ముచ్చటించారు. మధ్యాహ్న భోజనంపై ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. గుడ్డు బరువు తక్కువగా ఉంటే డీలర్లకు చెప్పి వాటి స్థానంలో బరువు ఎక్కువగా ఉన్న కోడిగుడ్లను తెచ్చుకోవాలన్నారు. అలాగే ఎంఎల్ఎస్ పాయింట్‌ను తనిఖీ చేసి నిత్యావసర సరుకుల తూకం సక్రమంగా ఉందా..లేదా చూశారు. పూతలపట్టు మండల కేంద్రంలోని పీహెచ్‌సీని సందర్శించారు. కార్యక్రమంలో డీఎస్ఓ శంకరన్, జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్ బాలక్రిష్ణ, డీఈఓ వరలక్ష్మి, సమగ్ర శిక్ష అభియాన్ ఏపీఓ వెంకటరమణ, ఏఈఓ మధు, వాసుదేవన్ పాల్గొన్నారు.

# సర్వే.. కనికట్టు!

జిల్లాలో ఎన్‌సీడీ సర్వేలో కాకిలెక్కలు నమోదు చేస్తున్నారు. ఇంటింటికి వెళ్లాల్సిన సర్వే సిబ్బంది ..చెట్ల కింద కూర్చొని ఫోన్‌లతోనే సర్వే చేసి మమ అనిపిస్తున్నారు. ఇక వ్యాధుల కాలంలో ఏదో ఒకటి నింపి పడేస్తున్నారు.. కొంత మందికి లేని వ్యాధులు సృష్టిస్తుండగా మరికొందరికి వ్యాధులున్నా లేనట్లు చూపిస్తూ తప్పులతడకగా నమోదు చేస్తుండడంపై ఉన్నతాధికారులు విస్తుపోతున్నారు. ఫలితంగా కేంద్ర ప్రభుత్వ లక్ష్యం నీరుగారిపోతోంది.

- ఫోన్‌లతోనే సర్వేలు కానిస్తున్న వైనం
- తప్పులతడకగా ఎన్‌సీడీ 3.0 సర్వే
- ఇష్టానుసారంగా వ్యాధులు సృష్టిస్తున్న వైనం
- ఇంటింటా సర్వేకు ముఖం చాటేసిన వైద్య సిబ్బంది
- ఓటీపీతో కదలకుండా సర్వే
- ఏఎన్‌ఎం, మిడ్‌లెవల్ హెల్త్ ప్రొవైడర్లు పట్టించుకోని వైనం

కాణిపాకం : జిల్లా వ్యాప్తంగా ఎన్‌సీడీ సర్వే తప్పులమయంగా మారింది. ఇష్టానుసారంగా సర్వే కొనసాగుతోంది. ఇంటింటా సర్వేకు వైద్య సిబ్బంది ముఖం చాటేశారు. కదలకుండా కూర్చున్న చోటే సర్వే సాగిస్తున్నారు. ఓటీపీ చెబితే చాలన్నట్లు.. కాకి లెక్కలు వేస్తూ సర్వే పూర్తి చేస్తున్నారు. ఓటీపీ దెబ్బకు అసంక్రమిత వ్యాధుల్లో ఏదో ఒకటి నింపి పడేస్తున్నారు. పర్యవేక్షణ లోపంతో ఏఎన్‌ఎం, మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్లు ఆ సర్వేను తోసిపుచ్చుతున్నారు. ఆశా వర్కర్లపై సర్వేభారం మోపుతున్నారు. దీంతో సర్వే తప్పుల తడకగా నమోదవుతున్నాయి. ఈ బాగోతం వెలుగులోకి రావడంతో వైద్య ఆరోగ్య శాఖ మల్లగుల్లాలు పడుతోంది. జీవనశైలిలో మార్పుల కారణంగా వ్యాధులు పుట్టుకొస్తున్నాయి. ప్రధానంగా బీపీ, మధుమేహం, క్యాన్సర్ , గుండె, కిడ్నీ తదితర వ్యాధులు మనిషిని హరిస్తున్నాయి. ఈ వ్యాధులను తొలి దశలోనే గుర్తించి వాటిని కట్టడి చేయాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం జాతీయ ఆరోగ్య మిషన్ ఆధ్వర్యంలో ఎన్‌సీడీ (నాన్ కమ్యూనికబుల్ డిసీజ్) ప్రోగ్రాంను చేపట్టింది. అసంక్రమిత వ్యాధులను ప్రధానంగా తీసుకుని వ్యాధుల నిర్ధారణకు శ్రీకారం చుట్టింది. 2021 అక్టోబర్‌లో మొదటగా ఎన్‌సీడీ 1.0, రెండో విడతగా 2022 అక్టోబర్ 2 నుంచి ఎన్‌సీడీ 2.0, తాజాగా ఈనెల 15వ తేదీ నుంచి ఎన్‌సీడీ 3.0 సర్వే కార్యక్రమం జరుగుతోంది. క్షేత్ర స్థాయిలో మిడ్‌లెవల్ హెల్త్ ప్రొవైడర్లు, ఏఎన్‌ఎం, ఆశాలు ప్రతి ఇళ్లు సందర్శించి వివరాలను సేకరించాలి. వ్యాధుల నిర్ధారణకు చర్యలు చేపట్టాలి. కానీ క్షేత్రస్థాయిలో ఆ సర్వే లక్ష్యం నీరుగారుతోంది.



ఎస్‌ఆర్‌పురంలో సర్వే చేస్తున్న సిబ్బంది (ఫైల్)



శిక్షణకు హాజరైన వైద్య సిబ్బంది (ఫైల్ )

### సర్వే చేయాల్సింది ఇలా..

ఎన్‌సీడీ సర్వే విధి విధానాలపై జిల్లా స్థాయి అధికారులు మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్లు, ఏఎన్‌ఎం, ఆశా వర్కర్లకు శిక్షణ ఇచ్చారు. ఈ మేరకు ఇంటింటికి వెళ్లి సర్వే చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఇంటింటికి వెళ్లి ఎత్తు, బరువు చూడడం, బీపీ, హెచ్‌బీ, మధుమేహం పరీక్షలు చేయడం, ఓరల్‌గా క్యాన్సర్ లక్షణాలు గుర్తించడం చేయాలని శిక్షణ ఇచ్చారు. అలా గుర్తించిన కేసులను అనుమానితంగా ఎన్‌సీడీ సర్వేలో అప్‌లోడ్ చేయాల్సి ఉంది. దీని ఆధారంగా డాక్టర్లు పరీక్షించి..వైద్య నిర్ధారణ చేసి అసంక్రమిత వ్యాధుల కట్టడికి చర్యలు తీసుకోవాల్సి ఉంది. వైద్య సిబ్బంది అలసత్వం కారణంగా ఎన్‌సీడీ సర్వే తప్పులమయంగా సాగుతోందని వాదనలు వినిపిస్తున్నాయి.

**జిల్లాలోని ఆస్పత్రుల సమాచారం**

| | |
|---|---|
| జిల్లా ఆస్పత్రి | 1 |
| ఏరియా ఆస్పత్రి | 4 |
| సీహెచ్‌సీలు | 8 |
| అర్బన్ హెల్త్ సెంటర్ | 15 |
| పీహెచ్‌సీలు | 50 |

### కదలకుండా..సర్వే....

ఎన్‌సీడీ ఇంటింటా సర్వే తప్పుల తడకగా నమోదవుతున్నాయి. ఇంట్లో ఉంటూ..వ్యక్తికి ఫోన్ చేసి ఓటీపీలు చెప్పండి అని అడుగుతున్నారు. వారు చెప్పే ఓటీపీ ఆధారంగా యాప్‌లో సర్వే వివరాలను నింపుతున్నారు. ఇక చాలా మంది ఏఎన్‌ఎంలు, మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్లు సర్వే జోలికి వెళ్లడం లేదు. వారు ఆశా వర్కర్ల చేతికి పని అప్పగించి..తేలికగా వదిలేస్తున్నారు. కొన్ని చోట్ల ఇద్దరు ఏఎన్‌ఎంలు ఉంటే...సర్వే చేయడంలో నువ్వా..నేనా అంటూ మొండికేస్తున్నారు. టార్గెట్ పోరు పడలేక బతికి ఉన్నవాళ్లను కూడా చంపేస్తున్నారు. చనిపోయిన జాబితాతో పాటు పర్మినెంట్ మైగ్రేట్, టెంపరరీ మైగ్రేట్, సి–బ్యాక్ సర్వే కంప్లీట్ జాబితాల్లోకి నెట్టేస్తున్నారు. దీంతో సర్వే జిల్లాలో గందరగోళంగా తయారైంది. గతవారం సాక్షి దినపత్రికలో ప్రచురితమైన ‘బతికుండగానే మృతుల జాబితాలోకి’ అనే కథనంలో ఈ సర్వే తప్పుల తడక బట్టబయలైంది. దీంతో అధికారులు ఏఎన్‌ఎం, ఆశావర్కర్లతో సమీక్ష సమావేశం నిర్వహించి..సర్వేలోని లోపాలను మళ్లీ రీబ్యాక్ చేయించారు. ఇక జరిగిన తప్పులకు నింద పడకుండా ఎవరికి వారు తప్పించుకునే పనిలో పడ్డారు. ఈ సర్వేపై పర్యవేక్షణ పూర్తిగా కొరవడుతోంది.

**జిల్లా సర్వే సమాచారం**

| | |
|---|---|
| జిల్లాలో మొత్తం జనాభా : | 18,72,951 |
| స్క్రీనింగ్ పరీక్ష పూర్తయినవారు : | 4,56,511 |
| రక్తపోటు : | 5,414 |
| మధుమేహం : | 6,001 |
| రెండు ఉన్న వారు (బీపీ,మధుమేహం) : | 4,424 |
| నోటి క్యాన్సర్ : | 117 |
| రొమ్ము క్యాన్సర్ : | 112 |
| గర్భాశయ క్యాన్సర్ : | 112 |

**తప్పిదాలు లేకుండా చూస్తాం**



“ఏఎన్‌సీడీ సర్వేలో ఏ విధంగా చేశారో తెలుసుకుంటాం. ఆ తప్పిదాలు ఎలా జరిగాయో చూస్తున్నాం. సర్వేను ఇష్టానుసారంగా చేయడానికి కుదరదు. కచ్చితంగా ఇంటి వద్దకే వెళ్లి చేయాలి. ఎక్కడ పడితే అక్కడ కూర్చొని చేసేదానికి లేదు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం సర్వే చేయాలి. అలా కాకుండా చేస్తే చర్యలు తీసుకుంటాం. – సుధారాణి, డీఎంఅండ్‌హెచ్, చిత్తూరు

### నలుగురు పబ్లిక్ ప్రాసిక్యూటర్ల తొలగింపు

చిత్తూరు అర్బన్ : చిత్తూరులోని జిల్లా న్యాయస్థానాల్లో పనిచేస్తున్న నలుగురు అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్లను తొలగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లా కోర్టు ఏపీపీ పులికల్లు రవీంద్రనాథరెడ్డి, 9వ అదనపు జిల్లా కోర్టు ఏపీపీ హిమబిందు, 6వ అదనపు జిల్లా కోర్టు ఏపీపీ తోట పురుషోత్తం, అడిషినల్ అసిస్టెంట్ సెషన్స్ కోర్టు ఏపీపీ స్వాతిని తొలగిస్తూ.. మొదటి అదనపు జిల్లా కోర్టు ఏపీపీ లోకనాథరెడ్డి రాజీనామాను ఆమోదిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి.

# తప్పులు..తిప్పలు!

కూటమి ప్రభుత్వ అవగాహన రాహిత్యంతో ఉపాధ్యాయులు అష్టకష్టాలు పడుతున్నారు. ఆఘమేఘాలపై విడుదల చేసిన సీనియారిటీ జాబితాలో అన్నీ తప్పులే ఉండడంపై రగిలిపోతున్నారు. ఒకపక్క పరీక్షలు ముంచుకొచ్చిన వేళ తరగతులు నిర్వహించకుండా తప్పులు సరిద్దుకోవడానికి డీఈఓ కార్యాలయానికి రావాలని చెప్పడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు.



సీనియారిటీ జాబితా కసరత్తు చేస్తున్న విద్యాశాఖ సిబ్బంది (ఫైల్)

**టీచర్ల సీనియారిటీ జాబితాలో అన్నీ తప్పులే**

- అవస్థల్లో చిత్తూరు, తిరుపతి జిల్లాల అయ్యోర్లు
- చిత్తూరు డీఈఓ కార్యాలయానికి పరుగులు
- ప్రభుత్వ పాఠశాలల్లో కుంటుపడుతున్న చదువులు
- కూటమి ప్రభుత్వం పై భగ్గుమంటున్న ఉపాధ్యాయులు

చిత్తూరు కలెక్టరేట్: చిత్తూరు జిల్లాలో 2,436, తిరుపతి జిల్లాలో 2,444 ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలున్నాయి. చిత్తూరు జిల్లాలోని పాఠశాలల్లో ఒకటి నుంచి పదో తరగతి వరకు 1,41,217, తిరుపతి జిల్లాలో 1,87,444 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో వివిధ కేడర్లలో 24,836 మంది టీచర్లు విధులు నిర్వహిస్తున్నారు. రాష్ట్ర విద్యాశాఖ ఆదేశాల మేరకు చిత్తూరు, తిరుపతి జిల్లాల పరిధిలోని ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితా కసరత్తును గత రెండు నెలలుగా నిర్వహించారు. ప్రభుత్వ, జిల్లా పరిషత్, మండల పరిషత్, మున్సిపాలిటీ, కార్పొరేషన్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న టీచర్ల సీనియారిటీ జాబితాను ఉపాధ్యాయ సమాచార వ్యవస్థ (టిస్) ఆధారంగా సిద్ధం చేశారు. ఈ కసరత్తు పూర్తి చేశాక ఈ నెల 3వ తేదీన కేడర్ల వారీగా జాబితాను విద్యాశాఖ అధికారులు వెబ్‌సైట్‌లో నమోదు చేశారు. ఆ జాబితాను పరిశీలించుకున్న తర్వాత చిత్తూరు, తిరుపతి జిల్లాల్లోని టీచర్లు తమ వివరాలన్నీ తప్పుల తడకగా ఉన్నట్లు గగ్గోలు పెడుతున్నారు.

**అన్నీ తప్పులే**

అన్ని మేనేజ్‌మెంట్ల సీనియారిటీ జాబితాల్లో తప్పులే ఉన్నట్లు ఉపాధ్యాయులు వాపోతున్నారు. స్కూల్ అసిస్టెంట్ సీనియారిటీ జాబితాలను డీఎస్సీ, పుట్టిన తేదీల ఆధారంగా పొందుపరచడంతో సీనియర్, జూనియర్ అనే వ్యత్యాసం వచ్చినట్లు గగ్గోలు పెడుతున్నారు. ప్యానల్ సీనియారిటీ జాబితాలను పాటించకపోవడం వల్ల ఇలాంటి సమస్యలు ఏర్పడినట్లు టీచర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తప్పుల సవరణకు టీచర్లు చిత్తూరు డీఈవో కార్యాలయానికి వచ్చి అభ్యంతరాలు తెలియజేయాలని చెప్పడం బాధాకరమని పలువురు మండిపడుతున్నారు.

**తిరుపతి, చిత్తూరు జిల్లాల సమాచారం**

| | |
|---|---|
| చిత్తూరు జిల్లాలోని పాఠశాలలు | 2,436 |
| తిరుపతి జిల్లాలోని పాఠశాలలు | 2,444 |
| స్కూల్ అసిస్టెంట్ పోస్టులు మంజూరు | 8,435 |
| విధులు నిర్వహిస్తున్న స్కూల్ అసిస్టెంట్లు | 7,534 |
| స్కూల్ అసిస్టెంట్ల ఖాళీలు | 901 |
| ఎస్జీటీ పోస్టులు | 8,295 |
| విధులు నిర్వహిస్తున్న ఎస్జీటీలు | 6,443 |
| ఎస్జీటీ ఖాళీ పోస్టులు | 1,852 |
| పనిచేస్తున్న హెచ్‌ఎంలు | 408 |

### సమస్యలు ఇలా..

- ఉద్యోగోన్నతుల సందర్భంగా రెండు, మూడు రకాల తేదీలను పొందుపరచడంతో సీనియారిటీ జాబితాలో లోపాలు దొర్లాయి.
- 2002 అక్టోబర్ 31వ తేదీన ఉద్యోగోన్నతి పొందిన వారిలో వివిధ తేదీలను నమోదు చేయడం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయి.
- డీఎస్సీ 2000లో సెంకడరీ గ్రేడ్ టీచర్‌గా ఎంపికై , 2001 డీఎస్సీలో స్కూల్ అసిస్టెంట్‌గా ఎంపికైన వారి సీనియారిటీలో రెగ్యులర్ వారికంటే జాబితాలో ముందున్నారు.
- డీఎస్సీ 2018లో సోషియల్ (ఎస్ఏ) టీచర్లు వివిధ తేదీలలో జాయిన్ కావడంతో వారి సీనియారిటీ జాబితాలో వ్యత్యాసం కనిపిస్తోంది.
- 2002 ఆన్‌లైన్ టీచర్ల నియామక ప్రకారం ఆ కేడర్‌లో సీనియారిటీ పొందుపరచాలి.
- 2008 డీఎస్సీలో ఎంపికైన ఉపాధ్యాయుల సీనియారిటీని కొన్ని మండలాల్లో ఉత్తర్వుల ప్రకారం అమలు చేయకపోవడంతో అసమగ్రత ఏర్పడింది.

**తప్పులను తొలగించాలి**



విద్యాశాఖ అధికారులు విడుదల చేసిన సీనియారిటీ జాబితాలో దొర్లిన తప్పులను సవరించాలి. ఈ సీనియారిటీ జాబితాలో 90 శాతం తప్పులున్నాయి. ఇలాంటి జాబితాలు విడుదల చేయడం బాధాకరం. – జీవీ రమణ, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి

**ఆవేదనకు గురిచేస్తోంది**



టీచర్లకు సంబంధించిన సమగ్ర వివరాల జాబితాలు విద్యాశాఖ అధికారుల వద్ద ఉన్నప్పటికీ తాజాగా విడుదల చేసిన సీనియారిటీ జాబితాలో తప్పులు దొర్లడం ఆశ్చర్యం, ఆవేదనకు గురిచేస్తోంది. జాబితాలో దొర్లిన తప్పులను లోటుపాట్లను విద్యాశాఖ అధికారులు సరిదిద్దాలి. – మదన్ మోహన్‌రెడ్డి, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు, చిత్తూరు జిల్లా

**సీనియారిటీకి తిలోదకాలు**



సీనియారిటీకి తిలోదకాలు ఇచ్చి జాబితాలను సిద్ధం చేశారు. రెండుమూడేళ్ల తర్వాత ఉద్యోగోన్నతి పొందిన వారు సీనియర్లుగా ఉండడం ఆందోళన కలిగిస్తోంది. – రెడ్డిశేఖర్‌రెడ్డి, వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ట్రెజరర్

**ఇది కరెక్ట్ కాదు**



టీచర్లను ఇబ్బందులు పెట్టడం కరెక్టు కాదు. అధికారులు కసరత్తులో తప్పులు చేసి టీచర్లను వేధిస్తున్నారు. తప్పిదాలను తొలగించేందుకు ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని 66 మండలాల టీచర్లను చిత్తూరుకు వచ్చి నేరుగా అభ్యంతరాలు ఇవ్వాలని చెప్పడం సబబుకాదు. – బాలాజీ, ఆపస్ రాష్ట్ర అధ్యక్షుడు

# డ్రగ్స్‌కు కేంద్రంగా రాష్ట్రం: మాజీ మంత్రి

- సీఎం, హోం మంత్రి ఇలాఖాల్లో గంజాయి సాగు
- ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ ఎన్నికల్లో పరాజయమే నిదర్శనం
- సీఎం, హోం మంత్రి సిగ్గుపడాలి
- ప్రభుత్వంపై మాజీ మంత్రి ఆర్‌కె. రోజా ఆగ్రహం



చిత్తూరు జిల్లా జైలు వద్ద మాట్లాడుతున్న రోజా

చిత్తూరు అర్బన్ : ప్రజలకు ఇచ్చిన హామీలను మరిచిన కూటమి ప్రభుత్వం, రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తోందని.. అందుకే ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి ఓటమి చవిచూశారని మాజీ మంత్రి, నగరి ఎమ్మెల్యే ఆర్‌కె.రోజా ఆరోపించారు. నగరి నియోజకవర్గంలో తప్పుడు కేసులు పెట్టి అరెస్టు చేసిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలను మంగళవారం చిత్తూరు జిల్లా జైల్లో ఆమె పరామర్శించారు. అనంతరం మీడియాతో రోజా మాట్లాడుతూ.. ఓ వ్యక్తిపై ఎన్ని కేసులున్నా, పీటీ వారెంట్‌పై అన్నింటికీ కలిపి ఒక్కటే విచారణ సరిపోతుందని సుప్రీం కోర్టు చెప్పినా రాష్ట్ర ప్రభుత్వానికి ఏమాత్రం పట్టడం లేదన్నారు. పోసాని మురళీకృష్ణపై పోలీసుల వేధింపుల పర్వమే ఇందుకు నిదర్శమన్నారు. కూటమి నేతలు సెంటీ మీటరు చేస్తే, తాము కిలో మీటరు చేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ఎడ్యుకేషన్ హబ్‌గా ఉన్న పుత్తూరును డ్రగ్స్, గంజాయి విక్రయాలకు నిలయంగా మార్చేశారని, స్కూల్‌లో గంజాయి మత్తులో ఉన్న పిల్లలు ఉపాధ్యాయుడికి చొక్కా పట్టుకోవడం, ఆడ పిల్లలపై అసభ్యంగా ప్రవర్తించడం కూటమి పాలనలోనే చెల్లిందన్నారు. నేరస్తులకు లైసెన్సులు ఇచ్చి, ధైర్యాన్ని నూరిపోసే ఈ ఘటనలు చూసి రాష్ట్ర ముఖ్యమంత్రి, హోం మంత్రి సిగ్గుపడాలని దుయ్యబట్టారు. గుంటూరులోని హోం మంత్రి నియోజకవర్గంలో సాగయ్యే గంజాయి రాష్ట్రం మొత్తం సరఫరా అవడంతో పాటు, పక్క రాష్ట్రాలకు ఎగుమతి అవుతుందనే విషయం బహిరంగ రహస్యమన్నారు. అయినా కొందరు అధికారులు కూటమి నేతలు చెప్పిందే రాజ్యాంగంగా ప్రవర్తిస్తున్నారని, వాళ్లను వదలిపెట్టే ప్రసక్తేలేదన్నారు. రోజా వెంట పార్టీ నేతలు గాయత్రిదేవి, అంజలిరెడ్డి ఉన్నారు.

# కలర్ జిరాక్స్ హాల్‌టికెట్లు అనుమతించొద్దు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో నిర్వహిస్తున్న ఇంటర్మీడియట్ పరీక్షలకు విద్యార్థులు కలర్ జిరాక్స్ హాల్ టికెట్‌లు తీసుకొస్తే లోనికి అనుమతించరని ఇంటర్మీడియట్ డీవీఈవో సయ్యద్ మౌలా వెల్లడించారు. ఈ మేరకు మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో మొదటి, ద్వితీయ సంవత్సరం ఇంటర్మీడియట్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు హాల్ టికెట్‌లను వైట్ పేపర్ మీద ప్రింట్ అవుట్ తీసుకొని పరీక్షలకు హాజరుకావాలన్నారు. ఎటువంటి కలర్ జిరాక్స్ హాల్ టికెట్‌లను అనుమతించరని స్పష్టం చేశారు. మంగళవారం జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఇంగ్లీష్ పరీక్షలకు 16,986 మంది విద్యార్థులకు గాను 16,049 మంది హాజరుకాగా, 937 మంది గైర్హాజరైనట్లు డీవీఈవో వెల్లడించారు.

# ‘కంది’పాయే !

- రెండు నెలలుగా నిలిచిన సరఫరా
- ఆందోళనలో కార్డుదారులు



రెండు నెలలుగా కంది పప్పు ఊసేలేదు. దీంతో కార్డుదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

చిత్తూరు రూరల్ (కాణిపాకం) : కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక నిత్యావసరాల ధరలు ఆకాశాన్ని అంటాయి. కందిపప్పు ధరలూ పెరిగాయి. పౌర సరఫరాల శాఖ పంపిణీ చేసే కందిపప్పు అయినా వినియోగించుకుందామని కార్డుదారులు ఆలోచిస్తుంటే..కూటమి ప్రభుత్వం వారి ఆశలపై నీళ్లు చల్లింది. జనవరిలో అంతంత మాత్రంగా కందిపప్పు సరఫరా చేసింది. ఫిబ్రవరిలో బియ్యం, పంచదార పంపిణీ చేశారు. మార్చిలో అయినా కందిపప్పు ఇస్తారని కార్డుదారులు ఆశించారు. ఈనెలలోనూ కందిపప్పు సరఫరా చేయకపోవడంతో మండిపడుతున్నారు. బయట మార్కెట్లో కిలో కందిపప్పు రూ.200 పలుకుతోంది. ఎండీయూ వాహనాల ద్వారా కిలో రూ.67 కంది పప్పు లభిస్తుండటంతో కొంత వరకు సంతోషించారు. కేవలం కొన్ని నెలలకే పరిమితం కావడంతో ఆందోళన చెందుతున్నారు.

**పరిస్థితి ఇలా..**

జిల్లాలో 5.40 లక్షల కార్డులున్నాయి. వీరికి ప్రభుత్వం ప్రతి నెలా 15 వేల మెట్రిక్ టన్నుల బియ్యం, 5 వేల మెటిక్ర్ టన్నుల కంది పప్పు, 3.5 టన్నుల వరకు చక్కెర సరఫరా చేస్తోంది. అయితే జనవరికి మాత్రమే కందిపప్పు పరిమితమైంది.

### ప్రకటనలకే పరిమితం

చౌక దుకాణాల్లో రాయితీ కందిపప్పు లభించలేదు. ప్రతి కార్డుకూ కిలో చొప్పున నవంబర్, డిసెంబర్ నెలల్లో ఇచ్చారు. జనవరిలో ఎవరు ముందుగా బియ్యం విడిపిస్తే వారికే కంది పప్పు అందింది. ఫిబ్రవరిలో పూర్తిగా సరఫరా చేయలేదు. మార్చిలోనూ అదే పరిస్థితి. బియ్యంతో పాటు పంచదార, కందిపప్పు ఇస్తామని కూటమి ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటించింది. అధికారం చేపట్టాక హామీని తుంగలోకి తొక్కి పూర్తిగా సరఫరాను నిలిపివేసింది. సామాన్యులు కందిపప్పునకు నోచుకోవడం లేదు. దీనిపై సర్వత్రా నిరసన వ్యక్తం అవుతోంది.

## క్లుప్తంగా

### ఆర్టీసీ బస్సులో నగదు, బంగారం చోరీ

చిత్తూరు అర్బన్ : ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న దామలచెరువుకు చెందిన మహిళ నుంచి రూ. లక్ష నగదు, బంగారు నగలు చోరీకి గురయ్యాయి.. వివరాలు ఇలా..దామలచెరువుకు చెందిన ధర్మణి అనే మహిళ మంగళవారం బెంగళూరు వెళ్లేందుకు పాటూరులో పీలేరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఎక్కారు. బస్సు చిత్తూరు నగరంలోని పీసీఆర్ కూడలి వద్దకు రాగా కిందకు దిగిన మహిళ తన బ్యాగును చూసుకున్నారు. బ్యాగులో ఉన్న రూ.లక్ష నగదు, ఓ బంగారు గొలుసు చోరీకి గురైనట్లు గుర్తించారు. తనతో పాటు ప్రయాణం చేసిన మరో మహిళే ఈ చోరీకి పాల్పడినట్లు చెప్పడంతో చిత్తూరు వన్‌టౌన్ పోలీసులు దీనిపై విచారిస్తున్నారు.

### 5 టన్నుల రేషన్ బియ్యం స్వాధీనం

చిత్తూరు అర్బన్ : పేదలకు అందాల్సిన రేషన్ బియ్యాన్ని అక్రమంగా నిల్వ చేసిన గోదాముపై పోలీసులు దాడులు చేశారు. చిత్తూరు నగరంలోని కైలాశపురం శ్మశాన వాటిక సమీపంలో ఉన్న గోదాములో రేషన్ బియ్యం పెద్ద ఎత్తున నిల్వ చేసినట్లు పోలీసులకు సమాచారం అందింది. టూటౌన్ సీఐ నెట్టికంటయ్య, ఎస్ఐ ప్రసాద్ తన సిబ్బంది కలిసి మంగళవారం తనిఖీలు నిర్వహించారు. గోదాములో నిల్వ చేసిన 5 టన్నుల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన నిందితుడు వెంకటరమణ, మరో నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

### ప్రభుత్వ బడుల్లో మెనూ పాటించాలి



పెనుమూరులో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేస్తున్న ఫుడ్ కమిషన్ చైర్మన్

గంగాధర నెల్లూరు : నియోజకవర్గంలో మంగళవారం ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ ప్రతాప్ రెడ్డి విస్తృతంగా పర్యటించారు. పర్యటనలో భాగంగా పెనుమూరు, ఎస్ఆర్ పురం, గంగాధర నెల్లూరు, మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాలు, చౌక దుకాణాలు, పీహెచ్‌సీలు అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. గంగాధర నెల్లూరు మండలంలో బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థినులకు మధ్యాహ్న భోజనాల నిర్వహణను పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం పిల్లల ఆరోగ్యంపై దృష్టి సారించి మంచి నిర్ణయాలతో పాలు, గుడ్లు, వంటి అధిక విటమిన్, ప్రోటీన్‌లు కలిగిన ఆహారాన్ని పిల్లలకు అందిస్తుందని, పిల్లలు ఆరోగ్యంగా ఉంటే చదువులో ముందడుగు వేస్తారని తెలిపారు. కార్యక్రమంలో డీఎస్ఓ శంకరన్, సివిల్ సప్లై డీఎం బాలకృష్ణ, జిల్లా విద్యాశాఖాధికారి వరలక్ష్మి, ఐసీడీఎస్ అధికారి వెంకటేశ్వరి , సాంఘిక, వెనుకబడిన సంక్షేమశాఖ డీడీలు చెన్నయ్య, రబ్బానీ భాషా పాల్గొన్నారు.

హంద్రీ–నీవా రెండో దశ పనుల్లో పిల్ల కాలువలకు కూటమి ప్రభుత్వం మంగళం పాడింది. ఫలితంగా 2 లక్షల ఎకరాలకు చుక్క నీరు అందని పరిస్థితి నెలకొంది. కృష్ణా జలాల తరలింపు లక్ష్యం నెరవేరక పోవడంతో అన్నదాతకు గుండెకోత మిగిలింది. కరువుతో అల్లాడుతున్న రైతాంగానికి ఈ నిర్ణయం అశనిపాతంగా మారింది. కేవలం గుత్తేదారుల ప్రయోజనాలకే ప్రభుత్వం పెద్దపీట వేయడంతో అన్నదాతల ఆశలు గల్లంతయ్యాయి.



బి.కొత్తకోట వద్ద పుంగనూరు ఉపకాలువకు చేస్తున్న లైనింగ్ పనులు

# అందని నీళ్లు.. అన్నదాతకు కన్నీళ్లు

- పిల్ల కాలువలకు మంగళం!
- అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో 2,18,800 ఎకరాలకు అందని నీరు
- నెరవేరని కృష్ణా జలాల తరలింపు లక్ష్యం
- కొత్తగా లైనింగ్ పనులతో రైతాంగానికి తీవ్ర నష్టం

బి.కొత్తకోట : హంద్రీ–నీవా రెండో దశ సాగు, తాగునీటి ప్రాజెక్టు పనుల్లో కూటమి ప్రభుత్వం ఉప కాలువల లైనింగ్ పనులకు ప్రాధాన్యం ఇచ్చి పిల్ల కాల్వల తవ్వకం పనులు వదిలేయడంతో రైతాంగం తీవ్రంగా నష్టపోతోంది. 1994, 2005లో ప్రాజెక్టు పనులు చేపట్టేలా రూపొందించిన డీటైల్ ప్రాజెక్టు నివేదికల్లో ప్రాజెక్టు ఉప కాలువల నుంచి పిల్ల కాల్వలను తవ్వించి వాటి ద్వారా చివరి ఆయకట్టుకు సాగునీరు అందించాలనేది లక్ష్యం. ఒక ప్రాజెక్టు నుంచి చివరి ఆయకట్టు వరకు సాగునీరు వెళ్లాలంటే దాని ప్రధాన లేదా ఉప కాలువ నుంచి పిల్ల కాలువలను తవ్వించాలి. అయితే ఈ పనులను చేపట్టేందుకు కూటమి ప్రభుత్వం సుముఖంగా లేదు. కాంట్రాక్టర్లకు ప్రయోజనం చేకూర్చే పనులపైనే దృష్టి పెట్టింది. కరవుతో కష్టాలు పడుతున్న రైతాంగాన్ని ఇంకా కష్టాల్లోకి నెట్టేస్తోంది.

### కిరణ్ పెంచగా..వదిలేసిన బాబు

ప్రాజెక్టు పనులు చేపట్టిన కాంట్రాక్టర్ల ఒప్పందం మేరకు ఎకరాకు రూ.4,700తో పిల్ల కాలువ పనులు చేయాలి. మధ్యలో కల్వర్టులు, రోడ్లు, బ్రిడ్జిల నిర్మాణం చేయాల్సి వస్తే కాంట్రాక్టర్లే చేపట్టాలి. ఉమ్మడి రాష్ట్ర సీఎం కిరణ్‌కుమార్ సర్కారులో ఎకరాకు అదనంగా రూ.5,800 పెంచి రూ.10,500గా నిర్ణయించారు. 2014లో అధికారం చేపట్టిన చంద్రబాబు పిల్ల కాలువల పనులు చేపట్టకుండా కాంట్రాక్టర్లకు మేలు చేకూర్చేలా 2015లో జీఓ22 జారీతో ఈ పనులను కాంట్రాక్టర్లు వదిలేసుకున్నారు. ఫలితంగా రైతాంగానికి తీవ్ర నష్టం కలుగుతున్నా చంద్రబాబు సర్కారుకు ఏమాత్రం పట్టలేదు. ఇదే కథ మళ్లీ పునరావృతమైంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పనుల స్వరూపాన్నే మార్చేసి వారికి ఇష్టమైన పనులే చేపడుతున్నారు. కాగా చిత్తూరు జిల్లాకు సంబంధించి 60, 61 ప్యాకేజీల్లో పిల్ల కాలువల పనులు జరిగాయి.

**కుప్పానికి ఇదే పరిస్థితి**

సీఎం చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గ రైతుల పరిస్థితి ఇంచుమించూ అలాగే ఉంది. కుప్పం ఉప కాలువ నుంచి 6వేల ఎకరాలకు సాగునీరు అందించాల్సి ఉంది. ఇక్కడి 110 చెరువులకు కృష్ణా జలాలను తరలించి నీటిని అందిస్తారు. అయితే రెండు చోట్ల పిల్ల కాలువలను తవ్వించాల్సి ఉన్నప్పటికీ దీనిపై ప్రభుత్వం శ్రద్ధ చూపడం లేదు. కుప్పం నియోజకవర్గంలో 77, పలమనేరు నియోజకవర్గంలో 33 చెరువులకు కృష్ణా జలాలు అందించే ప్రణాళికపై చర్యలు తీసుకుంటారో లేదో స్పష్టత లేదు. కుప్పం కాలువకు లైనింగ్ పనులు చేస్తున్నందున ఆ ప్రభావం రెండు నియోజకవర్గాలపై పడనుంది.

ప్రాజెక్టు పరిధిలో ఆయకట్టు సాగు వివరాలు..

| ఉపకాలువ | కి.మీ | ఆయకట్టు (ఎకరాల్లో) |
|---|---|---|
| తంబళ్లపల్లె | 30.750 | 15,000 |
| పుంగనూరు | 224.5 | 85,900 |
| వాయల్పాడు | 23.50 | 17,200 |
| నీవా | 122.5 | 57,500 |
| చింతపర్తి | 42.30 | 22,400 |
| ఎల్లుట్ల | 25.17 | 15,400 |
| సదుం | 19.1 | 5,400 |

### లైనింగ్ పనులపై ఆసక్తి

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.1,217 కోట్లతో పుంగనూరు ఉప కాలువను వెడల్పు చేసి రైతులకు ప్రయోజనం కల్పించాలని నిర్ణయిస్తే కూటమి ప్రభుత్వం ఈ పనిపై కక్ష కట్టింది. గత సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పేరు చిరస్థాయిగా నిలిచిపోతుందని వెడల్పు పని రద్దు చేసి కాంక్రీట్ లైనింగ్ పని చేయిస్తున్నారు. దీనివల్ల కాంట్రాక్టర్‌కు తప్ప రైతులకు ప్రయోజనం లేదు. కాలువకు స్లూయిజ్‌ల నిర్మాణం చేపట్టకుండా కేవలం సమీపంలోని చెరువులకు మాత్రమే నీటిని అందించి చేతులు దులుపుకునే పరిస్థితి నెలకొంది. పిల్ల కాలువలు తవ్వించి 2,18,800 ఎకరాల సాగుకు నీరివ్వకుండా కొన్ని చెరువులు నింపేందుకే ఆసక్తిగా ఉంది. పిల్ల కాలువలు వదిలేయడంతో రైతాంగం తీవ్రంగా నష్టపోతోంది. ఫలితంగా కాలువసాగే మార్గంలో ఒక్క ఎకరాకు సాగునీరు అందదు. ఫలితంగా ప్రాజెక్టు లక్ష్యం నీరుగారిపోతోంది.

### 28 మండలాలకు తీవ్ర నష్టం

పిల్ల కాలువ పనులు చేపట్టకపోవడంతో అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లోని 28 మండలాలు కరవు పరిస్థితి నుంచి గట్టెక్కలేని దుస్థితి దాపురించింది. బి.కొత్తకోట, ములకలచెరువు, పెద్ద తిప్పసముద్రం, తంబళ్లపల్లి, కురబలకోట, మదనపల్లి, పెద్దమండ్యం, పుంగనూరు, చౌడపల్లి, పులిచర్ల, సదుం, పలమనేరు, పెద్దపంజాణి, గంగవరం, చిత్తూరు, గుడిపాల, పాకాల, చంద్రగిరి, కేవీ.పల్లి, వాయల్పాడు, కలకడ, కలికిరి, గుర్రంకొండ, పీలేరు, పెనుమూరు, పూతలపట్టు, ఐరాల, తవణంపల్లి మండలాలకు సాగునీరు అందక తీవ్రంగా నష్టపోతున్నాయి. ప్రభుత్వ నిర్ణయంతో ఈ మండలాలకు నిర్ణయించిన ఆయకట్టు భూమికి కృష్ణా జలాలతో పంట సాగు కలగా మారింది.

### పిల్ల కాలువలతోనే సస్యశ్యామలం

ప్రస్తుత అన్నమయ్య, చిత్తూరు జిల్లాలో సాగే హంద్రీ–నీవా ప్రాజెక్టు ఉప కాలువల నుంచి రైతుల పొలాలకు నీళ్లు అందించేలా ప్రతి 40 నుంచి 100 ఎకరాలకు ఒక పిల్ల కాలువను తవ్వాలి. దీనికి నీటిని తరలించేలా ఉప కాలువ వద్ద స్లూయిజ్‌లను నిర్మించాలి. ఇలా చేయడం ద్వారా రెండు జి ల్లాలకు చెందిన తంబళ్లపల్లె, మదనపల్లె, పీలేరు, పుంగనూరు, పలమనేరు, చిత్తూరు, పూతలపట్టు, చంద్రగిరి నియోజకవర్గాల్లోని 2,18,800 ఎకరాలకు శ్రీశైలం నుంచి ఇక్కడికి తరలించే కృష్ణా జలాలను సాగుకు అందించాలి. అయితే ప్రభుత్వం వీటిని తవ్వించేందుకు సుముఖంగా లేదు. రైతు ప్రయోజనాలను పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా లైనింగ్ పనులపైనే శ్రద్ధ చూపుతోంది.

## మామిడిలో దిగుబడులు సాధించాలి



హాజరైన ఆర్‌బీకే సిబ్బంది

చిత్తూరు రూరల్ (కాణిపాకం) : మామిడి సాగులో సరైన యాజమాన్య పద్ధతులు పాటించి తక్కువ ఖర్చుతో నాణ్యమైన దిగుబడులు సాధించాలని జిల్లా ఉద్యానశాఖ అధికారి మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. చిత్తూరు నగరంలోని మ్యాంగో భవన్‌లో మంగళవారం మామిడి పంటలో సస్యరక్షణ, ప్రత్యామ్నాయ పంటలపై ఆర్‌బీఎస్‌కే సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మామిడి రైతులు మేలైన పద్ధతులు, సస్యరక్షణ చర్యలు చేపట్టి రైతులు పెట్టుబడులు తగ్గించుకునేలా చూడాలన్నారు. ప్రధానంగా మామిడి కొమ్మల కత్తిరింపులు చేపట్టి తెగుళ్లు, పురుగులను సమర్థవంతంగా అరికట్టవచ్చునన్నారు. మామిడి కవర్లను 50 శాతం రాయితీతో అందిస్తున్నామన్నారు. సీనియర్ శాస్త్రవేత్త శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ.. కాయ దశలో మామిడి పంటకు తామర పురుగు ఆశిస్తుందన్నారు. దీనికి జిగురు అట్ట బుట్టలను చెట్టుకు పెట్టుకోవాలన్నారు. మరో సీనియర్ శాస్త్రవేత్త కవిత మాట్లాడుతూ.. మామిడిలో బూడిద తెగుళ్లకు హెక్సాకోనజోల్ వాడాలన్నారు. ప్రత్యామ్నాయ పంటలైన చింత, నిమ్మ, సీతాఫలం వంటి పంటల గురించి వివరించారు. కార్యక్రమంలో ఏపీఎంఐపీ పీడీ బాలసుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

## నాటుసారా నిర్మూలనలో భాగస్వామ్యం

పాలసముద్రం : నాటుసారా నిర్మూలనలో భాగస్వాములు కావాలని జిల్లా అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాస ఆచారి తెలిపారు. మంగళవారం నరసింహాపురంలో సాటుసారా నిర్మూలనలో భాగంగా జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాసులు, కార్వేటినగరం ఎక్సైజ్ సీఐ శిరీషాదేవి ఆధ్వర్యంలో నవోదయం కార్యక్రమం నిర్వహించారు. జిల్లా అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాస ఆచారి మాట్లాడుతూ.. నాటుసారా తాగడం వల్ల కలిగే అనర్థాలు, నష్టాలను గ్రామ ప్రజలకు వివరించారు. నాటుసారా రహిత మండలంగా తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. అనంతరం గ్రామస్తులతో కలసి నాటు సారా రహిత గ్రామంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐ మోసస్, సాయితేజ, పాల్గొన్నారు.

## దరఖాస్తుల ఆహ్వానం

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా కేంద్రానికి సమీపంలో మురకంబట్టు వద్ద ఉన్న మైనారిటీ గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ భార్గవి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. 2025–26 విద్యా సంవత్సరంలో 5, 6, 7, 8 తరగతుల్లో ప్రవేశానికి ముస్లిం ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ విద్యార్థులు అర్హులన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు www.apras.apcfss.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నెల 31 వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఏప్రిల్ 25వ తేదీన ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. వివరాలకు 8712625058 సంప్రదించాలని కోరారు.

## 90 లీటర్ల నాటు సారా స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న సారా

కుప్పం : విక్రయానికి సిద్ధంగా ఉన్న 90 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌శాఖ సీఐ నాగరాజు తెలిపారు. రామకుప్పం మండలం రామాపురం తండాలో నాటు సారా తయారీ చేసి విక్రయానికి సిద్ధంగా ఉన్న సారాను స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు తెలిపారు. సారా తయారీ చేసిన నిందితుడు విజయ్ కుమార్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

**20 లీటర్లు..**



సారా విక్రేతను అరెస్టు చూపుతున్న అధికారులు

కార్వేటినగరం : కార్వేటినగరం ఎక్సైజ్ శాఖ సర్కిల్ పరిధిలోని వెదురుకుప్పం మండలంలో దాడులు నిర్వహించి 20 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకుని, ఒకరిని అరెస్టు చేసినట్లు చిత్తూరు ఎన్‌ఫోర్స్‌మెంట్ , ఎక్సైజ్‌శాఖ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ తెలిపారు. మంగళవారం ఎక్సైజ్ కార్యాలయం వద్ద ఎస్ఐ సుబ్రమణ్యం వివరాలను వెల్లడించారు. వెదురుకుప్పం మండలంలోని నక్కలంపల్లిలో దాడులు నిర్వహించగా బాలక్రిష్ణయ్య సారా విక్రయాలు చేస్తుండగా పట్టుకొని అతడి వద్ద ఉన్న 20 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని నిందితుడిని అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

- ఒకరికి తీవ్రగాయాలు



మృతిచెందిన శ్రావణ్ (ఫైల్)



తీవ్రంగా గాయపడిన చెన్నకేశవులు

కార్వేటినగరం : రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని కొల్లాగుంట చెక్‌పోస్టు వద్ద మంగళవారం చిత్తూరు–పుత్తూరు జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. ఏఎస్ఐ మునికృష్ణ కథనం మేరకు వివరాలు.. మండలంలోని ఆళత్తూరు గ్రామానికి చెందిన ఈశ్వర్ ఆచారి , మనెమ్మ కుమారుడు శ్రావణ్ (25) అదే గ్రామానికి చెందిన చెన్నకేశవుల(21)తో కలసి సోమవారం రాత్రి కొల్లాగుంటలోని తన స్నేహితుడి పుట్టిన రోజు వేడుకల్లో పాల్గొని రాత్రి ఒంటి గంట సమయంలో స్వగ్రామానికి తిరిగీ వస్తుండగా కొల్లాగుంట చెక్‌పోస్టు వద్ద శ్రావణ్ ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి వస్తున్న మరో బైక్ వేగంగా వచ్చి ఢీ కొనడంతో శ్రావణ్ అక్కడికక్కడే మృతి చెందాడు. ద్విచక్ర వాహనంలో వెనుక ఉన్న చెన్నకేశవులకు తీవ్రగాయాలు కావడంతో అతడిని తిరుపతి రుయాకు తరలించారు. అతడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు పేర్కొన్నారు. వెనుకవైపు నుంచి ద్విచక్రవాహనాన్ని ఢీ కొన్న వ్యక్తి రంజిత్‌గా గుర్తించామని అతడు వాహనాన్ని ప్రమాద స్థలంలో వదలి పరారీ అయ్యాడని రంజిత్ కోసం గాలిస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు. శ్రావణ్‌కు ఆరు నెలల కిందటే వివాహమైంది. ఆకస్మికంగా రోడ్డు ప్రమాదంలో భర్త మృతి చెందడంతో భార్య రోహిణి కన్నీమున్నీరుగా విలపించారు. దీంతో గ్రామంలో విషాద చాయలు అలుముకున్నాయి.

## పంచాయతీ నిధుల స్వాహాపై విచారణ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని బంగారుపాళ్యం మండలం గుండ్లకట్టమంచి పంచాయతీ నిధుల స్వాహాపై విచారణ చేయాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ జెడ్పీ సీఈవోను ఆదేశించారు. ఈ మేరకు గుండ్లకట్టమంచి గ్రామస్తులు కలెక్టర్‌కు చేసిన లిఖిత పూర్వక ఫిర్యాదు మేరకు విచారణ అధికారిని నియమించారు. గ్రామస్తుల కథనం మేరకు వివరాలు ఇలా.. గుండ్లకట్టమంచి గ్రామంలో మూడేళ్లుగా ఎలాంటి పారిశుద్ధ్య పనులు చేయకుండానే సర్పంచ్ శ్రీనివాసులు తన భార్య నాగలక్ష్మి పేరుతో నిధులను స్వాహా చేసినట్లు పేర్కొన్నారు. ఎటువంటి బిల్లులు, ఎం బుక్ లేకుండానే తన భార్య పేరుతో రూ.10 లక్షల వరకు గ్రామ పంచాయతీ నిధులను స్వాహా చేశారన్నారు. ఈ వ్యవహారంలో గ్రామ సెక్రటరీ ఉమాపతి నకిలీ బిల్లులను సృష్టించి కీలకపాత్ర వహించినట్లు తెలిపారు. చివరకు చిరు ఉద్యోగులైన గ్రీన్ అంబాసిడర్ల వేతనాలు దాదాపు రూ.2 లక్షల వరకు సర్పంచ్ భార్య పేరుతో నకిలీ ఓచర్లను సృష్టించి కాజేశారన్నారు. 15 వ ఆర్థిక సంఘం నిధులకు ఎటువంటి బిల్లులు, ఎంబుక్కులు లేకుండా దాదాపు రూ.8 లక్షలు చట్టవిరుద్ధంగా చెక్కుల రూపంలో నిధులను విత్‌డ్రా చేసి స్వాహా చేశారని ఆరోపించారు. నిధులను స్వాహాకు సంబంధించి ఆధారాలు సైతం అందజేశామని కలెక్టర్ విచారణ చేయించి న్యాయం చేయాలని కోరారు.



## ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలి

పుంగనూరు : విద్యార్థులు భయం, ఒత్తిడి వదిలి ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలని ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు బాలసుబ్రమణ్యం సూచించారు. మంగళవారం స్థానిక వికాస్ పాఠశాలలో దివ్యజ్ఞానజ్యోతి సంఘం అధ్యక్షుడు వెంకటేష్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పరీక్షలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు రకాల పరీక్షలు నిర్వహించి, గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో విశ్రాంత అధ్యాపకులు వెంకటపతి తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన అంతర్జాతీయ సదస్సు

తిరుపతి సిటీ : జాతీయ సంస్కృత వర్సిటీలో శక్తివిశిష్టాద్వైతం అనే అంశంపై మూడు రోజులుగా నిర్వహిస్తున్న అంతర్జాతీయ సదస్సు మంగళవారంతో పరిపూర్ణమైంది. ముఖ్యఅతిథిగా కాశీపీఠం శ్రీమద్ కాశీ జ్ఞానసింహాసనాధీశులు జగద్గురు డాక్టర్ మల్లికార్జున విశ్వారాధ్య శివాచార్యులు హాజరయ్యారు. శక్తి విశిష్టాద్వైత కేంద్రాన్ని వర్సిటీ ఏర్పాటు చేయడం సంతోషకరమని, విద్యార్థులకు శాస్త్ర అధ్యయనానికి ఎంతో ఉపకరిస్తుందని వెల్లడించారు. కార్యక్రమంలో బెనారస్ హిందూ వర్సిటీ ప్రొఫెసర్ రాజారాం శుక్లా, రిజిస్ట్రార్ కేవీ నారాయణరావు, ప్రొఫెసర్ గణేష్ భట్, శివరామదాయగుడే, మనోజ్‌షిండే పాల్గొన్నారు.

# ‘ముఖ్య’ నేతల రేషన్ దందా

- తమిళనాడు టూ కర్ణాటక వయా కుప్పం
- అడ్డూ అదుపులేని అక్రమ బియ్యం రవాణా
- కూటమి ‘ముఖ్య’ నేతలే సూత్రదారులు
- ఆంధ్రా, తమిళనాడు మధ్య అక్రమ రవాణా చిచ్చు





కర్ణాటకకు అక్రమంగా తరలుతున్న బియ్యం వాహనం (ఫైల్), అక్రమంగా తరలుతున్న బియ్యాన్ని పట్టుకున్న ప్రత్యేక బృందం (ఫైల్ )

సాక్షి, టాస్క్ ఫోర్స్ : కూటమి అధికారం చేపట్టిన తరువాత తమిళనాడు నుంచి కుప్పం మీదుగా కర్ణాటకకు అక్రమ బియ్యం రవాణాకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. అక్రమ రవాణాకు టీడీపీ ‘ముఖ్య’ నేతలే సూత్రధారులై కొనసాగిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. కాగా ఈ అక్రమ రవాణా రెండు రాష్ట్రాల నిఘా బృందాలకు మధ్య చిచ్చురేపుతోంది. కుప్పం నియోజకవర్గంలో కూటమికి సంబంధించి ఎవరు అక్రమ బియ్యం రవాణా చేసినా పసిగట్టి కేసులు నమోదు చేయిస్తారు. కేవలం ‘ముఖ్య’ నేతల కనుసైగల్లోనే బియ్యం అక్రమ రవాణా సాగిస్తున్నారు. తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వం రేషన్ కార్డులకు పంపిణీ చేసే బియ్యం కుప్పం మీదుగా కర్ణాటకు చేరడం కొన్నేళ్లుగా సాగుతోంది. కాగా కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత ఈ వ్యాపారానికి నియంతల ఆధికంగా కూటమి ‘ముఖ్య’ నేతలే కొనసాగిస్తున్నారు. కుప్పం నియోజకవర్గంలో రామకుప్పం మండలం వీర్నమల, ననియాల, దేవరాజపురం, ఆరిమానుపెంట, కుప్పం మండలం మల్లానూరు, అడవిబూదగూరు, నడుమూరు, పైపాళ్యం గ్రామాల మీదుగా, శాంతిపురం మండలం నుంచి విజలాపురం తదితర గ్రామాల మీదుగా కర్ణాటకకు చేరుకుంటోంది. ప్రస్తుతం భారీ వాహనాలు టిప్పర్‌లు, బొలెరో పికప్, మినీ లారీల ద్వారా వందల బస్తాలు అక్రమంగా కర్ణాటక రాష్ట్రం బంగారుపేటలోని రైస్ మిల్లులకు చేరవేస్తున్నారు.

**‘ముఖ్య’ నేతలే కీలక పాత్ర...**

కుప్పం కేంద్రంగా జరుగుతున్న బియ్యం అక్రమ రవాణాకు టీడీపీకి చెందిన నాలుగు మండలాల ‘ముఖ్య’ నేతలే కీలక పాత్ర పోషిస్తూ నడుపుతున్నారని సర్వత్రా ఆరోపణలున్నాయి. నియోజకవర్గంలో ఎవరూ బియ్యం వ్యాపారం చేయకూడదని ఆంక్షలు విధించినట్లు సమాచారం. టీడీపీకే చెందిన కొందరు నాయకులు వాణియంబాడి నుంచి బియ్యం కొనుగోలు చేసి బంగారుపేటకు తరలిస్తుండగా ‘ముఖ్య’నేతలు ప్రత్యేకంగా నిఘా బృందానికి సమాచారం ఇచ్చి పట్టించారు. ఈ బియ్యం రవాణాపై అధికార పార్టీ నేతల మధ్యే కొంత కాలంగా విభేదాలు తలెత్తుతున్నాయి.

**నేతల కనుసైగల్లో నిఘా బృందం**

అక్రమాలను అడ్డుకోవాల్సిన నిఘా బృందం అధికార పార్టీ ‘ముఖ్య’ నేతల కనుసన్నల్లో నడుస్తోంది. కుప్పం మీదుగా ప్రతి రోజూ వందల్లో టిప్పర్లు, మినీ లారీలు కర్ణాటక సరిహద్దులు దాటుతున్నా తమకేమీ తెలియదని తెలిసీ తెలియనట్లు వ్యవహరిస్తున్నారు. సాక్షాత్తు శాంతిపురం, గుడుపల్లి పోలీసు స్టేషన్ ఎదురుగా బియ్యం రవాణా వెళ్తున్నా అధికారులకు అంతుపట్టకపోవడం విడ్డూరంగా ఉంది. నియోజకవర్గంలో కర్ణాటక వెళ్లాలంటే రెండు స్టేషన్ల ముందు వైపు వెళ్లాల్సిందే. బియ్యం రవాణా జరుగుతోందని తెలిసినా పట్టించుకోకపోవడం అక్రమ రవాణాకు ఆజ్యం పోస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

### చిచ్చు రేపుతున్న అక్రమ రవాణా

సరిహద్దు రాష్ట్రాలు ఆంధ్రా, తమిళనాడు పోలీసుల మధ్య బియ్యం అక్రమ రవాణా చిచ్చురేపుతోంది. రెండు రోజులుగా కుప్పంలో జరిగిన పలు సంఘటనలు పట్టణంలో హాట్ టాపిక్‌గా మారింది. తమిళనాడు నుంచి అక్రమ రవాణాను పట్టుకునేందుకు బియ్యం రవాణా వాహనాలు వెంటాడి ఆంధ్రాకు వచ్చిన తమిళనాడు పోలీసులు ఆంధ్రా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తమ పరిధిలో సమాచారం ఇవ్వకుండా వాహనాలను, వ్యక్తులను ఎలా పట్టుకుంటారంటూ తమిళనాడు పోలీసులను కుప్పం సర్కిల్ ఆఫీసులో నిలబెట్టారు. ఈ సంఘటన తమిళనాడులో సంచలనమైంది. దీంతో ఉన్నత స్థాయి అధికారులు సైతం కలగజేసుకొని పరిస్థితిని చక్కదిద్దారు. ఈ సంఘటనతో రెండు రాష్ట్రాల మధ్య అక్రమ రవాణా చిచ్చురేపుతోంది. కేవలం అధికార పార్టీ ‘ముఖ్య’నేతల సూచన మేరకే కుప్పం నిఘా బృందం తమిళనాడు పోలీసులు రచ్చ చేసుకుంటున్నారని స్థానికులు అంటున్నారు.